క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఏపీఆర్ఎస్ విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు

పరిగి: రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని కొడిగెనహళ్లి ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో సదరు విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 24న అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలలో పాఠశాలకు చెందిన రితీష్‌కుమార్, సాంబశివ పాల్గొన్నారన్నారు. 8వ తరగతి చదువుతున్న రితీష్‌కుమార్ 100 మీటర్ల పరుగు పందెంలో, 7వ తరగతి చదువుతున్న సాంబశివ లాంగ్ జంప్‌లో సత్తాచాటి జిల్లాస్థాయి ప్రథమ స్థానాలను సాధించినట్లు చెప్పారు. త్వరలో విశాఖలో జరిగే రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. ఇద్దరు విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పీఈటీ షభానా, కృష్ణ, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

రేపు చేపల చెరువు వేలం

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురం చేపల చెరువు, దినసరి మార్కెట్ ద్వారా పంచాయతీకి వచ్చే ఆదాయం కోసం గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ భాస్కర్ తెలిపారు. చేపల చెరువు వేలం పాటలో పాల్గొనే వారు రూ.20 వేలు, దినసరి మార్కెట్ వేలం పాటలో పాల్గొనే వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనవచ్చని చెప్పారు.

పంట యాజమాన్యంపై అవగాహన



మాట్లాడుతున్న ఏడీఏ సనావుల్లా

చిలమత్తూరు: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్‌లో సాగు చేసే వేరుశనగ, మొక్కజొన్న, కంది పంటలపై సిబ్బందికి, రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం పుట్టపర్తి రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకుడు సనావుల్లా పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అదే విధంగా డ్రోన్‌తో మందుల పిచికారీ, నానో యూరియా, నానో డీఏపీ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు వంశీకృష్ణ, అబ్దుల్ అలీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

29న మండల సర్వసభ్య సమావేశం

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈనెల 29న (శనివారం) సాధారణ మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, ఎంపీపీ కవితతో పాటు అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, మండల, గ్రామస్థాయి అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు. మండలస్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

కేసుల రాజీకి చర్యలు



సమావేశమైన న్యాయమూర్తులు, న్యాయవాదులు

పెనుకొండ: కేసుల రాజీకి సత్వర చర్యలు చేపట్టాలని మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ టీ.వాసుదేవన్ పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు హాల్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ అధిక సంఖ్యలో బ్యాంక్ రుణాలకు సంబంధించిన కేసులు, మున్సిపల్ కేసులు పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ కేసుల విషయంలో కమిషనర్ తగిన దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి బొజ్జప్ప పలు విషయాలను వివరించారు. భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం

మడకశిర: మడకశిర మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశాన్ని గురువారం ఉదయం 10.30 గంటలకు కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రంగస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు, వైస్ చైర్మన్, వైస్ చైర్‌పర్సన్, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు సమావేశానికి తప్పకుండా హాజరకావాలని కోరారు.

రైతుల చూపు.. పత్తి సాగు వైపు !

- లాభదాయకంగా మారడంతో మడకశిరలో 372 హెక్టార్లలో సాగు
- రెండు రకాల పత్తి పంట సాగు
- అధికంగా క్రాస్ రకం
- కూలీలకు చేతినిండా పని

మడకశిర: నియోజకవర్గంలోని రైతులు పత్తి పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పత్తి సాగు లాభదాయకంగా మారడంతో రైతులు పత్తి పంటను సాగు చేయడానికి ముందుకు వస్తున్నారు. ప్రతి ఏడాది ఎక్కువగా ఖరీఫ్ సీజన్‌లో రైతులు పత్తి పంటను సాగు చేస్తారు. ఈ ఏడాది ముఖ్యంగా గుడిబండ మండలంలో పత్తిని అధికంగా సాగు చేశారు. ఐదేళ్ల క్రితం వరకూ నియోజకవర్గ వ్యాప్తంగా 50 హెక్టార్లలో కూడా పత్తి పంటను సాగు చేసే వారు కారు. అయితే ఇటీవల కాలంలో పత్తి సాగు విస్తీర్ణం క్రమేణా పెరుగుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 372 హెక్టార్లలో పత్తి పంట సాగు చేయడం విశేషం.

రెండు రకాల పత్తి సాగు

నియోజకవర్గంలోని రైతులు రెండు రకాల పత్తి పంటను సాగు చేశారు. క్రాస్ రకం పత్తి సాగు, కమర్షియల్ రకం పత్తి సాగు ప్రధానమైనవి. గతంలో ఎక్కువగా కమర్షియల్ రకం పత్తి సాగుపై రైతులు ఆసక్తి చూపే వారు. అయితే గత రెండేళ్ల నుంచి కమర్షియల్ రకం పత్తిసాగును తగ్గించారు. ప్రస్తుతం క్రాస్ రకం పత్తి సాగుపై రైతులు ఆసక్తి పెంచుకున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా క్రాస్ రకం పత్తి సాగు 90 శాతం ఉంటే.... కమర్షియల్ రకం పత్తి సాగు 10 శాతం మాత్రమే ఉంది. క్రాస్ రకం పత్తి సాగు లాభదాయకంగా మారడంతో అందరూ ఆ రకాన్నే సాగు చేస్తున్నారు.

మడకశిరలో పత్తి సాగు విస్తీర్ణం ఇలా...

మండలం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
మడకశిర	20
అమరాపురం	70
గుడిబండ	247
రొళ్ళ	30
అగళి	05
మొత్తం	372

క్వింటాలు రూ.50 వేలు

రైతులు క్రాస్ రకం పత్తి పంట సాగును కేవలం పత్తి విత్తనాలను ఉత్పత్తి చేయడానికే చేస్తారు. రైతులు ముందుగానే జిన్నింగ్ మిల్లుల యాజమానులతో ఒప్పందం చేసుకుని ఈ రకం పంటను సాగు చేస్తారు. ఈ పంట సాగుకు అయ్యే ఖర్చులను మిల్లుల యాజమానులే భరిస్తారు. ఎరువులు, మందులు, సాగుకు పెట్టుబడి మిల్లుల యాజమానులే సమకూరుస్తారు. పంటను కూడా మిల్లుల యాజమానులే కొనుగోలు చేస్తారు. పత్తి విత్తనాలకు ముందుగానే ధర నిర్ణయిస్తారు. ఈ ఏడాది క్వింటాల్ పత్తి విత్తనాలకు రూ.50 వేలు ధర నిర్ణయించారు. అంతే కాకుండా విత్తనాలు తీసేటప్పుడు వచ్చే పత్తికి (కాటన్)క్వింటాల్‌కు రూ.20 వేలు ధర నిర్ణయించారు. ఇంతకు మునుపు క్వింటాల్ పత్తి విత్తనాలకు రూ.35 వేలు, పత్తికి క్వింటాల్‌కు రూ.12 వేలు చెల్లించే వారు. అయితే మిల్లుల యాజమానులు ఈ ఏడాది ధరను పెంచడంతో రైతులు క్రాస్ రకం పత్తిని అధికంగా సాగు చేశారు.



మడకశిరలో సాగు చేసిన పత్తి పంట

గిట్టుబాటు లేకపోవడంతోనే...

గిట్టుబాటు ధర లేకపోవడంతోనే కమర్షియల్ రకం పత్తిని సాగుచేయడం లేదని చెబుతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో పంట సాగును తగ్గించారు. క్వింటాల్ కమర్షియల్ పత్తి రూ.5 వేల నుంచి 10 వేల వరకూ మాత్రమే ధర ఉంటుంది. ప్రారంభంలో ధర కొంత వరకు అధికంగా ఉన్నా....ఆ తర్వాత ధర పూర్తిగా తగ్గిపోతుంది. దీంతో రైతులు కమర్షియల్ పత్తిసాగును తగ్గించారు.

కూలీలకు ఉపాధి

క్రాస్ రకం పత్తి సాగు కూలీలకు ఉపాధి కల్పిస్తోంది. దాదాపు 3 నెలల పాటు కూలీలకు పూర్తిస్థాయిలో ఉపాధి దొరుకుతుంది. ముఖ్యంగా క్రాస్ రకం పత్తి సాగులో మగ, ఆడ పువ్వులను క్రాస్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు కూలీలు అవసరం ఎక్కువగా ఉంటుంది. 3 నెలల పాటు ఇలా క్రాస్ చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కూలీలకు అధిక డిమాండ్ ఉంటుంది. ముందుగానే రైతులు కూలీలకు అడ్వాన్స్‌లు ఇచ్చి రిజర్వ్ చేసుకుంటారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు క్రాస్ చేయాల్సి ఉంటుంది. ఇందుకు రోజుకు ఆడ కూలీకి రూ. 300 చెల్లిస్తారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పంటల బీమా

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పత్తి పంటకు పంటల బీమాను వర్తింపజేశారు. ప్రతి ఏడాది పత్తి రైతులకు ఉచిత పంటల బీమా అందింది. ఇది కూడా పత్తి సాగు విస్తీర్ణం పెరగడానికి కారణంగా మారింది. నియోజకవర్గంలో పత్తిపంటను సాగు చేసిన రైతులకు బీమా రావడంతో రైతులు కొంత వరకూ ఊరట చెందారు.

పత్తి సాగు లాభదాయకం



పత్తి సాగు లాభదాయకంగా మారింది. ప్రధానంగా క్రాస్ రకం పత్తిని అధికంగా సాగు చేస్తున్నాం. జిన్నింగ్ మిల్లుల యాజమానులు పత్తి విత్తనాలకు ఈఏడాది గతంలో కంటే ఎక్కువ ధర నిర్ణయించారు. ధర పెంచడం పత్తి రైతులకు ఎంతగానో ఊరట నిస్తోంది. ఎకరా సాగు చేస్తే 7 క్వింటాళ్ల వరకూ విత్తనాలు ఉత్పత్తి అవుతాయి. రూ.3.50 లక్షల వరకూ ఆదాయం వస్తుంది.

– రంగనాథ్, హనుమంతనపల్లి, రొళ్ల మండలం

బీమా ఇచ్చిన ఘనత జగన్‌దే



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పత్తి రైతులకు ప్రోత్సాహం అందించడం ఎంతో గొప్ప విషయం. ప్రతి ఏడాది ఉచిత పంటల బీమాను అందించి ఆదుకున్న ఘనత కూడా జగన్‌దే. ప్రస్తుత ప్రభుత్వం కూడా పత్తి రైతులను ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రోత్సహించడంతోనే పత్తి సాగు పెరగడానికి అవకాశం ఏర్పడింది.

– కరియప్ప, తమదేపల్లి, అమరాపురం మండలం

పంట విస్తీర్ణం పెంపునకు కృషి



నియోజకవర్గంలో పత్తి సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ప్రతి ఏడాది పంట సాగు విస్తీర్ణాన్ని పెంచడానికి కృషి చేస్తున్నాం. పత్తి పంట పెట్టే రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నాం. ప్రధానంగా తెగుళ్లు సోకకుండా ఎలాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలో రైతులను అప్రమత్తం చేస్తున్నాం. లాభదాయకంగా ఉండటంతోనే రైతులు పత్తి సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

– కృష్ణమీనన్, ఏడీఏ, మడకశిర

సస్యరక్షణతో మంచి దిగుబడి



మాట్లాడుతున్న డీఆర్‌సీ ఏడీ సనావుల్లా

లేపాక్షి: మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం ఉదయం పంటల సాగు పద్ధతులు, సస్యరక్షణపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌సీ ఏడీ సనావుల్లా, ఏఓ అబ్దుల్ అలీ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పండించే పంటల యాజమాన్యం, సస్యరక్షణ గురించి వివరించారు. పంట మార్పిడి చేసుకోవడం వలన ఉపయోగాలు తెలియజేశారు. వేరుశనగ పంటలో అంతర పంటలు, మేరసాలు తప్పని సరిగా వేసుకోవాలని, మొక్కజొన్న పంటలో అంతరపంటలుగా ప్రతి ఐదుసాలుకు ఒక వరుస కంది, ఆముదం పంట వేసుకోవాలని సూచించారు. దీనివల్ల కత్తెర పురుగును కొంతమేరకు నివారించవచ్చన్నారు. ముఖ్యంగా నానో యూరియా బాటిల్ ఒక బస్తా యూరియాకు సమానమని, ఖర్చు కూడా తక్కువేనని వివరించారు. నానో డీఏపీ ఒక బాటిల్ ఒక బస్తా డీఏపీకి సమానమన్నారు. అలాగే చిరుధాన్యాలైన కొర్రలు, సజ్జలు, అరికలు, రాగుల ఆవశ్యకతను వివరించారు. ప్రతి రైతు చిరుధాన్యాలను పండించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలత, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఎంపీడీఓ మునిస్వామి

అమరాపురం: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ మునిస్వామి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మునిస్వామి ఆధ్వర్యంలో మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ ప్రత్యూష, హేమావతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భార్గవ్, ఈఓఆర్డీ నాగముని తదితరుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షకాలం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో జ్వరం, దగ్గు, మలేరియా, జలుబు తదితర వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. పంచాయతీ, వైద్య సిబ్బంది సంయుక్తంగా గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేపట్టాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మరుగు నీరు నిలువ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



మాట్లాడుతున్న సీడీపీఓ నాగమల్లేశ్వరి

మడకశిరరూరల్: మండల పరిధిలోని బుళ్లసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మహిళా శిశు సంక్షేమశాఖ, ఆర్డీటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. పది తరువాత పెళ్లి కాదు పదకొండు అనే అంశంపై లఘు చిత్రం ద్వారా వివరించారు. సీడీపీఓ నాగమల్లేశ్వరి మాట్లాడుతూ విద్యార్థినులు బాల్యవివాహాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేయడానికి ప్రయత్నిస్తుంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 100, 112 లకు సమాచారం అందించాలన్నారు. ఆర్డీటీ టీమ్ లీడర్ అదినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, హెచ్ఎం విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



జ్యోతులు మోస్తున్న మహిళా భక్తులు



అలంకరణలో కరియమ్మ

అగళి: మండల పరిధిలోని ఇరిగేపల్లి పంచాయతీలోని నందరాజనపల్లి గ్రామంలో బేవినహళ్లి కరియమ్మ జ్యోతుల ఉత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. కర్ణాటకలోని బేవనహళ్లి గ్రామంలో కొలువైన కరియమ్మదేవి అమ్మ ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి మేళతాళాలతో సోమవారం నందరాజనపల్లి గ్రామానికి తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన మహిళలు భక్తిశ్రద్ధలతో బియ్యం పిండితో చేసిన చెలిమిడిని జ్యోతులుగా చేసుకొని గ్రామం నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

సంక్షిప్త సమాచారం

వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంట్లో చోరీ

హిందూపురం: నియోజకవర్గంలోని చిలమత్తూరు మండలంలోని కొడికొండకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కోతుల రమేష్ ఇంట్లో చోరీ జరిగింది. గ్రామస్తుల వివరాలమేరకు... సోమవారం రాత్రి దుండగులు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోని వస్తువులు ధ్వంసం చేసి బీరువాలోని జత కమ్మలు, ఉంగరం, రూ.5 వేల నగదు ఎత్తుకెళ్లారన్నారు. మంగళవారం ఉదయం ఇంటికి చేరుకున్న రమేష్ భార్య కృష్ణ పోయిన వస్తువుల వివరాలు తెలియజేసిందన్నారు. ఇదిలా ఉంటే టీడీపీ నేతల బెదిరింపుల నేపథ్యంలో రమేష్ ఊరు వదిలి వెళ్లాడు. ఎవరూ ఇంటిలో లేని సమయంలో ఇలా చోరీ జరగడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

కవాతును జయప్రదం చేయండి

మడకశిర: ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో మాదిగ ఉద్యోగులు మంగళవారం పట్టణంలో సమావేశమయ్యారు. జూలై 7న వరంగల్‌లో జరిగే మాదిగల ఆత్మ గౌరవ కవాతు కార్యక్రమాన్ని విజయవంతం చేసే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా కవాతుకు సంబంధించిన బ్యానర్‌ను ఎంఈఎఫ్ నాయకులు ప్రదర్శించి విజయవంతం చేయాలని కోరారు. ఎంఈఎఫ్ జాతీయ అదనపు కార్యదర్శి బండారు శంకర్ , ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో సుంకం వసూలుకు వేలం

రొళ్ల: స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం వారపు సంత మార్కెట్, బస్టాండ్ ఆవరణలో సుంకం వసూలు కోసం ఈఓఆర్డీ కృష్ణప్ప, పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్ ఆధ్వర్యంలో వేలం పాటను నిర్వహించారు. పట్టణానికి చెందిన శేఖర్ వారపు సంత మార్కెట్‌ను రూ.42,500కు, బస్టాండ్ సుంకం వసూలుకు రూ.60 వేలకు దక్కించుకున్నాడన్నారు. వేలం పాటలో పాడిన మొత్తాన్ని వారం రోజుల్లోపు చెల్లించాల్సి ఉంటుందని ఈఓఆర్డీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రామలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసన్నకుమార్, శశికుమార్, నగేష్‌రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్లాల చెరువులో మెడికల్ క్యాంప్

గోరంట్ల: మండల పరిధిలోని బెల్లాల చెరువు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం డాక్టర్ వాసు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలో వివిధ జబ్బులతో బాధపడుతున్న రోగులను పరీక్షించి మందులు అందజేశారు. వైద్యసిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి సీజనల్ వ్యాధుల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ రమణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పశువుల సంత వేలం

గుడిబండ: మండల పంచాయతీ కార్యాలయంలో మంగళవారం వారపు పశువుల సంత మార్కెట్, బస్టాండ్ సుంకం వసూలుకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. గుడిబండకు చెందిన శ్రీరామప్ప అత్యధికంగా పశువుల సంతను రూ.41 లక్షలా 50 వేలకు దక్కించుకున్నారు. కూరగాయల సంత వేలాన్ని పురుషోత్తం రూ. లక్షా 80 వేలకు , దినసరి బస్టాండ్ రూ. లక్షా 10 వేలకు దక్కించుకున్నారు.

ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక

హిందూపురం: పట్టణ ఆటో యూనియన్ నూతన కమిటీని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, జిల్లా కోశాధికారి బాబు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పట్టణ ఏఐటీయూసీ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా సమీవుల్లా, ఎస్‌బీఐ ఆటో స్టాండ్ కార్యదర్శిగా నౌషాద్, రైల్వేస్టేషన్ ఆటోస్టాండ్ కోశాధికారిగా జమీర్, ఏఆర్ ఆటో స్టాండ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కమల్‌బాషా, సీపీఐ ఆటో స్టాండ్ ఉప ప్రధాన కార్యదర్శిగా జియావుల్లా, అబ్రార్ ఆటోస్టాండ్ ఉపాధ్యక్షుడిగా అరుణ్, ఖలీల్, బాబాజాన్, అంజాద్, సహాయ కార్యదర్శిగా ఆసిఫ్, ఆరీఫ్, జిలాన్, అబ్దుల్లాతో పాటు కమిటీ సభ్యులుగా 8 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మారుతీరెడ్డి, పట్టణ అధ్యక్షుడు జాబీవుల్ల తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పునః ప్రారంభానికి చర్యలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని భీమరాయనపల్లి గ్రామంలో 2015 సంవత్సరంలో మూతపడిన ప్రాథమిక పాఠశాలను పునః ప్రారంభించడానికి చర్యలు చేపట్టామని ఎంఈఓ భాస్కర్ తెలిపారు. గ్రామంలో 28 మంది విద్యార్థులు ఉన్నారని, రోజూ కిలో మీటరు దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బంది ఉందని పాఠశాలను పునః ప్రారంభించాలని గ్రామ ప్రజలు కోరారని ఎంఈఓ తెలిపారు. ఇందులో భాగంగానే మంగళవారం భీమరాయనపల్లి గ్రామంలో మూతపడిన ప్రాథమిక పాఠశాలను పరిశీలించినట్లు చెప్పారు. స్థానికులతో విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నామన్నారు.

విశ్రాంత హోంగార్డులకు సన్మానం



హోంగార్డులను సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: పదవీ విరమణ పొందిన విశ్రాంత హోం గార్డులు మహ్మద్ బుడేన్, అశ్వర్థప్పలను స్థానిక హోంగార్డుల సంఘం మంగళవారం ఘనంగా సన్మానించింది. పట్టణంలోని తాలూకా కార్యాలయంలో ఉన్న హోంగార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో జమేదార్ రాజేశ్ మాట్లాడుతూ హోం గార్డులుగా రాత్రింబవళ్లు కష్టపడి విధులు నిర్వహించి శాంతి భద్రతలు కాపాడడంలో చిత్తశుద్ధి ప్రదర్శించిన మహ్మద్ బుడేన్, అశ్వర్థప్ప విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

దివ్యాంగులకు పరికరాల పంపిణీ



పరికరాలను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

పరిగి: మండలంలోని పలువురు దివ్యాంగులకు సహాయక పరికరాలను మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ నవీన, స్వరూపరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నడవలేని వారికి సహాయక పరికరాలను పంపిణీ చేశారు. డాక్టర్ నవీన, స్వరూపరెడ్డి మాట్లాడుతూ జాతీయ ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మండలానికి చెందిన బాధితులకు 150 నడుము పట్టీలు, 18 హ్యాండ్ కఫ్ వాకర్స్, 30 మెడ బెల్టులు, మరో 150 వాకింగ్ స్టిక్‌లను అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వన్నప్ప, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ శంకర్

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని పంచాయతీ కార్యాలయం సమీపంలో వివాదాస్పదంగా మారిన స్థలాన్ని మంగళవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ శంకర్‌తో పాటు వీఆర్ఓ, సర్వేయర్ స్థలాన్ని సందర్శించారు. చేనేత కార్మిక సంఘం నాయకుల వద్ద ఉన్న పత్రాలు, అదే విధంగా స్థలం కొనుగోలు చేశానని చెబుతున్న అమరేంద్రతో కూడా పత్రాలను సేకరించారు. కార్యాలయం రికార్డులు కూడా పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు. స్థలంలో పదేళ్లుగా అనుభవంలో ఉన్నామని, న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న అధికారులకు విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి



అలంకరణలో గణపతి

హిందూపురం: సంకష్ట హర చతుర్థిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి వినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీనివాసనగర్, బెంగళూరురోడ్‌లోని గణపతి ఆలయంలో ఉదయం, సాయంత్రం మహాగణాధిపతికి పూజలు చేశారు. రాత్రి ఆలయ ఆవరణలో సంకష్ట హార మహాగణపతి హోమం చేశారు. ఉదయం నుంచి ఉపవాసదీక్షలు చేసిన భక్తులు రాత్రి ఆలయానికి చేరుకుని గణపతికి పూజలు చేసి ఉపవాస దీక్షలను విరమించారు.